

# కథా కౌముది

## దిద్దుకున్న తప్పు

అగస్త్యప్రగడ హేమంత

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**అందరూ** మనవాళ్ళే అనుకుంటాం. అయితే వాళ్ళ చేతిలో ఏదో ఒక ఎదురుదెబ్బ తిన్న తర్వాత గానీ అర్థంకాదు. మనం చేసిన పొరపాటు ఏవిటో. అది గుర్తొచ్చినప్పుడల్లా, పదే పదే తప్పు చేశావేమో అనిపిస్తుంది. అలాంటి అపరాధ భావమే ఇప్పుడు నాగమణి మనసుని తొలిచేస్తోంది. గత మూడురోజులుగా అదే వరస. ఆలోచిస్తుంటే తలలోని నరాలు చిట్లిపోతాయేమో అనిపించింది. బాధగా కణతలు రుద్దుకుంది.

"ఏమ్మా! తలనొప్పిగా ఉందా?" ఆప్యాయంగా వినిపించడంతో, తల తిప్పి ప్రశ్న వినిపించిన దిశగా చూసింది. పక్క బెడ్ మీదున్న ముసలావిడ తాలుకు బంధువు కాబోలు. తననే గమనిస్తోంది.

"లేదు" తల అడ్డంగా తిప్పుతూ అంది నాగమణి.

ఆవిడెవరో తనకి తెలియదు. తనెవరో ఆవిడకి తెలీదు. అయినా ఎదుటి మనిషి పట్ల ఎంత ఆదరణ చూపుతోంది. ఇందులో కనీసం ఒక వంతయినా తన రక్తసంబధీకులకి లేకపోయింది. అనుకుంటూంటే మనసు బరువెక్కింది. అప్పుడే కోపమూ ఒచ్చింది. అయినా తమ్ముడికి బుద్ధిలేదు. తనని ఇలా జనరల్ వార్డ్‌లో చేర్పించకపోతే స్పెషల్ రూంలో పెట్టించొచ్చుగా. లేదా! తను సంపాదించి తెచ్చిన డబ్బు బోలెడంత ఉంది. పోయేకాలం కాక పోతేనూ... అనుకుంటూంటే గుప్పున గుర్తొచ్చి ముక్కుపుటాల్ని తాకింది ఇలాచీ టీ వాసన. తలెత్తి చూస్తే, మళ్ళీ పక్క బెడ్ పేషెంట్ తాలూకు ఆవిడే

"కొంచెం వేడి టీ తాగమ్మా! తలనొప్పి నెమ్మదిస్తుంది" అంది గ్లాసుని నాగమణి వైపు జాపుతూ.

ఆ ఆత్మీయతకి కరిగిపోయిందామె. "మీ పేరు?" అడిగింది గ్లాసు అందుకుంటూ.

"పార్వతి" చెప్పింది.

"ఆవిడ మా అమ్మ" బెడ్ పైనున్న ముసలావిడని చూపిస్తూ అంది.

"నిజంగా ఈ పార్వతి చాలా మంచిది. ఆ మాటకొస్తే తన తమ్ముడూ మంచివాడే జనరల్ వార్డ్‌లో అందరితో కలిపి ఉంచాడు కనుకనే ఇప్పుడు ఈవిడ ఇలా తనతో మాట్లాడుతోంది. తనిలా వేడి టీ తాగగలుగుతోంది. అదే స్పెషల్ రూమ్ అయ్యుంటే బహుశా

పలకరించే దిక్కుకూడా ఉండేది కాదేమో" టీ తాగుతూ అనుకుంది. అంతవరకూ బానే ఉంది. కానీ ఉదయమనగా ఇంత కాఫీ తన మొహాన పోసి, టిఫిన్ తెస్తానంటూ వెళ్ళిన తమ్ముడు పదవుతున్నా రాకపోవడంతో ఆమె మనసులో తిరిగి గందరగోళం మొదలయింది. "నేను పొరపాటుగానీ చేశానేమో" అన్న ప్రశ్న మదిలో మళ్ళీ మొదలైంది. అలా అనుకోవడం అవాళ్టికి అది ఎన్నోసారో ఆమెకి గుర్తులేదు. కానీ మనసంతా ఒకలాంటి వేదనతో నిండిపోయి ఉండడం మాత్రం తెలుస్తోంది.

"ఎవరైనా ఒచ్చి, పక్కన కూర్చుని కాస్సేపు ప్రేమగా కబుర్లు చెపితే బాగుండును" అనిపించింది. కానీ ఎవరూ లేరు. పక్కన ఒక్క పార్వతి తప్ప. ఆమె కూడా వాళ్ళమ్మకి టిఫిన్ తినిపిస్తోంది. ఆమెనలా చూస్తుంటే నాగమణికి 'చంద్ర' గుర్తొచ్చాడు.

హైదరాబాద్‌లో ఉంటాడతను. నాగమణి మొదటిసారి సౌదీకి వెళుతున్నప్పుడు, ఎయిర్‌పోర్ట్‌లో పరిచయమయ్యాడు. ఇద్దరిదీ ఒకే ఫ్లైట్ కావడంతో ఆ పరిచయం మరింత పెరిగింది. సౌదీలో సెలవు దొరికినప్పుడల్లా ఇద్దరూ కలుసుకునేవారు. గంటల తరబడి మాట్లాడుకునేవారు. ఎవరెవరు ఎంత డబ్బు ఊరికి పంపించారు? ఎంత బేంక్ బేలన్స్ వుంది? ఏమేం కొన్నారు?లాంటివన్నీ దాపరికాలు లేకుండా చెప్పుకునేవారు.

ఇంటి దగ్గర ఉన్న తల్లి, చెల్లెళ్ళు, వాళ్ళ బాధ్యతలు గురించి చంద్ర చెబితే, అప్పటికి ఇంకా పెళ్ళికాని తమ్ముడు, చదువుకుంటున్న చెల్లెలి గురించి నాగమణి చెప్పేది. ఇంచుమించు ఇద్దరికీ ఒకరి బాధ్యతల గురించి మరొకరికి పూర్తిగా తెలుసు.

ఎన్ని కబుర్లు చెప్పేవాడు. ఒక్కోసారి ఇంటినుంచి ఫోన్ రాక తను దిగులు పడిపోయినప్పుడు, తన బాధని పోగొట్టడం కోసం, ఎంత పరితపించేవాడు. అక్కడ ఉన్నన్ని సంవత్సరాలూ, రోజూ క్రమం తప్పకుండా ఫోన్ చేసి తన యోగక్షేమాలు కనుక్కునేవాడు.

ఇండియాకి వచ్చేప్పుడు, వెళ్ళేటప్పుడు ఒకే డేట్ వుండేలా ప్లాన్ చేసుకునేవారు. ముంబయ్ వరకూ కలిసే వచ్చేవారు. అతనుంటే ఎంతో ధైర్యంగా వుండేది తనకి. అలాంటి చంద్రని, ఇంటికి రాగానే ఎంత నిర్దాక్షిణ్యంగా దూరం పెట్టింది తను? అదంతా తన చుట్టూ వీళ్ళంతా ఉండగా మళ్ళీ అతనికి సన్నిహితంగా ఉండడం బావుండదని కదూ. అనుకుంటూంటే మనసు మరింత కలవరపడింది. "ఏమ్మా! మీ వాళ్ళెవరూ రాలేదా?" మళ్ళీ వినిపించిన పార్వతి పలకరింపుతో చటుక్కున కళ్ళు తెరిచింది నాగమణి.

"రాలేదు" చెప్పింది. ఎందుకొస్తారు? వాళ్ళకి ముఖ్యంగా తన మరదలికి డబ్బే ప్రధానం. వాళ్ళ పిల్లలకి తను కొనిచ్చే స్మార్ట్‌ఫోన్‌లు లాప్‌టాప్‌లు ఇవి ప్రధానం. అంతే తప్ప తను కాదు. డబ్బు సంపాదించినంతకాలం తనని ఎంతో గౌరవించింది. ఇప్పుడు ఇక సంపాదించింది చాలనుకుని ఇండియాలోనే ఉండిపోతాననే సరికి వచ్చింది ఆమెలోని మార్పంతా.

అప్పట్నుంచే నిర్లక్ష్యం మొదలైంది. రెండునెలల సెలవులో తను వచ్చినప్పుడల్లా కాలుకింద పెట్టనివ్వకుండా చూసుకున్న ఆమె ఇప్పుడు తనకో శత్రువులా మారిపోయింది. ఉంటానంటేనే ఇలా మారిన మనిషి ఇక పెళ్ళి చేసుకుంటానంటే ఎలా స్పందిస్తుందో? బహుశా ఆస్తి చేజారిపోతుందనే అభద్రతా భావమే మనుషుల్ని మార్చేస్తుందేమో.

తనూ మనిషే, ఎన్నాళ్ళని తన వాళ్ళకీ, దేశానికీ దూరంగా ఉండగలదు? ఎన్నాళ్ళని వాళ్ళకీ వీళ్ళకీ చాకిరీ చెయ్యగలదు? అవన్నీ తన వల్లకాకనే కదా ఇక వెళ్ళకూడదనుకుంది. కానీ ఆ నిర్ణయం మరదలి నిజస్వరూపాన్ని బయటపెడుతుందని ఊహించలేదు. ఆఖరికి మూడురోజులుగా మూసిన కన్ను తెరవకుండా పడివున్న తనని కనీసం పలకరించనైనా లేదు. అదంతా చూడలేకనేమో తమ్ముడు తనని తెచ్చి హాస్పిటల్‌లో పడేశాడు. అనుకుంటూంటే అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాటిని దాచడం ఆమెకి సాధ్యం కాలేదు.

అందుకే అవి పార్వతి కంటపడ్డాయి.

"అయ్యయ్యో ఏమైంది?" అడిగిందామె నాగమణి కన్నీరు చూసి.

"ఏమో? కళ్ళు మండుతున్నాయి" చటుక్కున అబద్ధం చెప్పేసింది.

"అంతే. ఇదుగో ఈ రెండు ఇడ్లీలు తినేసి, కాస్సేపు కళ్ళు మూసుకుని పడుకో" చెప్పి ఇడ్లీ ప్లేటు ఆమెకి అందించింది.

ముందు మొహమాటపడ్డా, నీరసం నిలువనివ్వకపోవడంతో వాటిని అందుకుని తినేసింది. ఇంతలో డ్యూటీ నర్స్ వచ్చి అందరికీ టాబ్లెట్స్ అందించి, ఇంజెక్షన్‌లు ఉన్నవాళ్ళకి అవీ అందించేసి వెళ్ళిపోయింది. "థాంక్స్" అంది నాగమణి, నర్స్ అటువెళ్ళగానే పార్వతివైపు తిరుగుతూ.

"అయ్యో! ఈ మాత్రం దానికేనా! భలేదానివే" అంటూ నవ్వేసిందామె.

"ఏమ్మా ఓ మాటడుగుతాను. నీకు పెళ్ళయిందా?" ప్రశ్నించింది.

"లేదు" అన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

తలతాకట్టు పెట్టయినా సరే తన పెళ్ళి చెయ్యాలని అనుకున్నాడు తండ్రి. కానీ తనేం చేసింది? అప్పటికే ముప్పై వచ్చేసినా తన వెనకున్న తమ్ముడు, చెల్లెలి గురించి ఆలోచించింది. చేతినిండా డబ్బుంటే చాలు కానిది లేదు. అసలు అదిచ్చే ధైర్యమే వేరు. ఆపైన ముప్పై మీరితే పెళ్ళికి పనికిరారనుకోవడం నాటిమాట. ఏభైల్లోకి వచ్చినా పెళ్ళి వింతకాకపోవడం ఇప్పటి మాట. అంచేత ముందు సంపాదన. తర్వాతే పెళ్ళి అనుకుని కదూ దాన్ని వాయిదా వేసుకుంది. తనేకాదు, తన వాళ్ళూ రేపటి రోజున డబ్బుకోసం ఇబ్బంది పడకూడదని కదూ. అంతంతమాత్రం చదువున్న తనలాంటి వాళ్ళు బాగా డబ్బు సంపాదించాలంటే అందుకు ఏ సౌదికో వెళ్ళడం ఒక మార్గం అని తెలుసుకున్నది. అందుకేగా ఇంటిని బేంక్‌లో తనఖా పెట్టించి ఆ డబ్బుతో వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని తెగించి గల్ఫ్‌కి బయల్దేరింద్ది. ఒకటికాదు, రెండు కాదు పదేళ్ళపాటు కష్టపడి పైసాపైసా కూడబెట్టి ఇంటికి పంపించి, ఆ డబ్బుతో తనఖా విడిపించడమే కాదు పదెకరాల పొలం, ఇంకో ఇల్లు ఇవన్నీ కొనిపించింది. తమ్ముడికీ చెల్లెలికీ ఘనంగా పెళ్ళిళ్ళు చేసింది తన కష్టార్జితంతో కాదూ.

అసలు ఇందులో తన తప్పు కూడా ఉంది. ఇబ్బడి ముబ్బడిగా డబ్బులున్నప్పుడు కొన్ని కావాలనిపిస్తాయి. ఇంకొన్ని అవసరం లేదనిపిస్తాయి. అల ఒద్దనిపించిన వాటిలో పెళ్ళికూడా ఉండడంతో సంపాదన మీద దృష్టిపెట్టింది తప్ప తన గురించి పట్టించుకోలేదు. పైగా తర్వాతెప్పుడో తీరిగ్గా ఆలోచించుకుందామనుకుంది. ఎంతసేపూ వాళ్ళ సుఖం గురించే పాకులాడింది తప్ప, తన భవిష్యత్ గురించి చింతపడలేదు. ఇంత చేసిన తనకోసం, వాళ్ళు ఏదో ఒకటి చెయ్యకపోతారా! అన్న ధీమాతో. అలా చెయ్యడమే తను చేసిన పొరపాటేమోనని ఇప్పుడనిపిస్తోంది.

కానీ ఏం లాభం? పాతికేళ్ళ వయసులో పెళ్ళి చేస్తానంటే కాదు పొమ్మని తీరిగ్గా ఇప్పుడు ప్రయత్నాలు మొదలెడదామనుకుంది. కానీ ఫార్టీ ప్లస్‌లో పెళ్ళంటే తమ్ముడు మరదలు పడనిచ్చేట్టులేరు. మరదలి మెప్పుకోసం తను మళ్ళీ సౌదీకి వెళ్ళి అక్కడ ఆ చాకిరీ చెయ్యలేదు. అలాగని ఒంటరిగా ఉండనూలేదు. అంతేమరి. చేతిలో చిల్లిగవ్వలేని వాళ్ళని ఎలాగైనా ఒదిలించుకోవాలని చూస్తారు. చేతినిండా డబ్బున్న వాళ్ళని ఒడిసి పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. లోకరీతిని అనుసరించి మసలుకోకపోతే ఇబ్బందులు తప్పవు. ఇప్పుడు తన పరిస్థితి అదే. ఈ స్థితిలో ఏం చెయ్యాలి తను? ఆలోచిస్తుంటే మళ్ళీ మనసు తన ప్రశ్నకి జవాబివ్వకుండా పరధ్యానంలో పడ్డ నాగమణిని చూసి విషయం చూచాయగా గ్రహించింది పార్వతి. "ఏ పరిచయం లేకపోయినా ఇలా చెబుతున్నానని ఏమీ అనుకోకు. కొన్ని బంధాలు చేతిలో డబ్బు, ఒంట్లో ఓపిక, అవతలి వాళ్ళకి మనతో అవసరం ఇలాంటి వాటి వల్లనే నిలబడతాయి. అవి లేనినాడు తెగిపోతాయి. కానీ కొన్ని బంధాలు మాత్రం ప్రేమ, పెళ్ళి, ఆప్యాయత ఇలాంటి వాటితోనే పెనవేసుకుంటాయి. ఏనాటికైనా అవే శాశ్వతం. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నువ్వూ, నీకంటూ ఒక దారిని ఏర్పరచుకోవడం మంచిది. అంటే పెళ్ళి చేసుకోవడంలాంటిది" అంది.

"అనే నాకూ ఉంది. కానీ కుదిరేట్టు లేదు" నిరాసక్తంగా అంది నాగమణి.

"మనసున్న చోట మార్గం కనపడుతుంది. ప్రయత్నించు" ఠక్కున అంది పార్వతి.

"అదీ నీకంటూ ఓ తోడు ఉండడం కోసం. రోగాలూ రొచ్చులూ వచ్చినప్పుడు ఇలా ఇంకొకరి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడకుండా ఉండడం కోసం. ముఖ్యంగా మనసుకి కష్టంగా అనిపించిన క్షణాన అదంతా చెప్పుకుని గుండెని తేలిక పరచుకోవడం కోసం" మెల్లగా అందామె.

వింటున్న నాగమణికి అదీ నిజమేననిపించింది మనసారా సాటి మనిషితో మాట్లాడి ఎన్నాళ్ళయిందోఓ. కానీ, ఇప్పటికిప్పుడు అలాంటి ఒక తోడు ఎలా దొరుకుతుంది తనకి? అందుకు సహకరించేవాళ్ళెవరూ? అనుకుంటూంటే అప్పుడొచ్చాడు ఆమె తమ్ముడు, భోజనం కేరేజీ పట్టుకుని.

"ఏకంగా వంట చేసి ఇచ్చేస్తాను వుండమని మీ మరదలు అంటేనూ ఇక ఇన్నిసార్లు ఏం తిరుగుతానని ఉండిపోయాను" అన్నాడు. అదీ సంజాయిషీ ఇస్తున్నట్టు కాక, 'ఏదో ఒక కారణం చెప్పాలి కనుక చెప్పాను' అన్నట్టుగా.

సరిగ్గా అప్పుడే తమ్ముడి ఫోన్ రింగయింది ఎత్తితే అవతల్నుంచి మరదలు. ఏం చెప్పిందో ఏమోగానీ అతని మొహం ఒక్కసారి నల్లబడి తిరిగి యధాస్థితికి చేరుకుంది.

"ఎవరో చంద్రట సౌదీలో నీ ఫ్రెండ్‌ట కదా? ఆయన నీ సెల్‌కి కాల్ చేశాట్ట. నీ గురించి అడిగాట్ట. నువ్వు హాస్పిటల్లో ఉన్నావని మా ఆవిడ చెపితే, అడ్డమైన ప్రశ్నలూ వేసి విసిగించి నా నెంబరు అడిగి పుచ్చుకున్నాట్ట. ఇప్పుడో ఇంకాస్సేపట్లోనో ఫోన్ చేస్తాడట మా ఆవిడ చెప్పింది" అన్నాడు మొహం గంటు పెట్టుకుని.

"ఇంతకీ ఎవరా చంద్ర?" ఆరాతీశాడు ఆ మాటని ఎంత యధాలాపంగా అడగడానికి ప్రయత్నించినా అతని కళ్ళలో అనుమానం కదలడం నాగమణి దృష్టిని దాటిపోలేదు.

చంద్రపేరు వినగానే మనసు పొంగే సంద్రంలా మారినా అతికష్టం మీద అదుపు చేసుకుంది. ఉబికి ఒస్తున్న ఉద్వేగాన్ని తమ్ముడికంటపడకుండా నిభాయించుకుంది. "అతనంత ముఖ్యమైన వ్యక్తికాదులే" అంది నిర్లిప్తత నటిస్తూ. ఆ మాటతో తమ్ముడి ముఖం తేటపడడాన్ని ఆమె గమనించకపోలేదు.

అనుకున్నట్టుగానే పది నిమిషాల తర్వాత ఫోనొచ్చింది. చంద్ర మాట్లాడాడు. అతను తన పరామర్శని కేవలం ఫోన్‌కే పరిమితం చెయ్యదల్చుకోలేదు. అందుకే ఓ వారం తర్వాత హైదరాబాద్ నుంచి సరాసరి నాగమణి ఇంటికే వచ్చేశాడు.

తనని చూడడం కోసం అతను అంత ప్రత్యేకంగా, అదీ అంత దూరం నుంచీ రావడం ఆమెకి చాలా సంతోషాన్నిచ్చింది. ఇద్దరూ కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. కష్టం సుఖం కలబోసుకుంటుంటే మాటల మధ్య తెలిసింది. చంద్రకి ఇక సౌదీకి వెళ్ళే ఉద్దేశం లేదనీ ఇండియాలోనే వుండిపోవాలనుకుంటున్నాడనీను. చెల్లెళ్ళ బాధ్యతల కోసం పెళ్ళి మానేసి ఇన్నేళ్ళూ బ్రహ్మచారిగా ఉండిపోయిన అతను ఇప్పటికైనా తనవాళ్ళ మధ్యకి చేరడం ఆమెకి సమంజసంగా తోచింది.

ఎలాగూ సందర్భం వచ్చింది కనుక తన సంగతీ, తనవాళ్ళ స్వార్థం సంగతీ అన్నీ అతని దగ్గర వెళ్ళబోసుకుంది. ఆ విధంగా 'మీ వాళ్ళతోను జాగ్రత్తగా వుండు సుమా' అని అన్యాపదేశంగా హెచ్చరించింది.

అంతా విని గాఢంగా నిట్టూర్చాడతను. ఆ వెంటనే అన్నాడు. "మీరు పెళ్ళి చేసుకోవచ్చుగా?" అని.

"చేసుకోవాలనే వుంది. కానీ" ఇక ఆ మాటని ఎలా పూర్తి చేయాలో అర్థంకాక ఆగిపోయింది.

"ఆ ఏర్పాట్లు నేను చూస్తాను. సంబంధం కూడా సిద్ధంగా ఉంది. మీకు ఇష్టమైతే చెప్పండి. ఇప్పుడే అతని ఫోన్ నెంబరు ఇస్తాను" చెప్పాడు.

ఊహించని అవకాశం వచ్చి వళ్ళో పడ్డప్పుడు ఆలోచన అనవసరం అనిపించడంతో "సరే ఇవ్వండి" అంది సెల్ చేతిలోకి తీసుకుంటూ.

అతను నంబర్ చెప్పాడు.

ఆమె డయల్ చేసింది. వెంటనే రింగయింది. ఆ రింగ్ టోన్ చంద్ర సెల్ నుంచి రావడంతో ఆశ్చర్యపోయింది.

"ఇది కూడా నాదే డ్యూయల్ సిమ్" చెప్పాడు నవ్వుతూ.

అతను ఏ ఉద్దేశంతో వున్నాడో అర్ధమయ్యేసరికి ఆలోచనలో పడింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడతను అరగంట తర్వాత సంశయిస్తూనే.

"పెళ్ళి ఎక్కడ చేసుకుంటే బావుంటుంది? రిజిస్టర్ ఆఫీస్‌లోనా? కళ్యాణమండపంలోనా? అందర్నీ పిలుద్దామా? కొందర్ని మాత్రమే ఆహ్వానిద్దామా? ఇందాకట్నుంచీ ఏదీ తేల్చుకోలేకపోతున్నాను" తలొంచుకుని మెల్లగా ఆమె చెబుతుంటే అతని మొహంలో చిర్నవ్వు చోటు చేసుకుంది. "ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది నాకు" అన్నాడతను ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

"అవును. చేసిన పొరపాట్లు దిద్దుకునేందుకూ అవకాశాలొస్తాయి. వాటిని వినియోగించుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. నాక్కూడా" అంది నాగమణి.

Click here to share your comments on this story